సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



టన్ను చీనీ రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 23 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



19న ఐఏబీ సమావేశం

సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం ఈ నెల 19న నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ నిర్ణయించినట్లు హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
34.2°/23.6°

జిల్లా పరిధిలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.



విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకోవద్దు

కూటమి ప్రభుత్వం నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల్లోని విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన వైద్య కళాశాలల్లో అడ్మిషన్లు కల్పించకపోవడం దారుణం. ఎవరికో పేరొస్తుందని వేలాది మంది పిల్లల భవిష్యత్‌తో ఆడుకోవడం అన్యాయం. ఈ విషయంలో సీఎం చంద్రబాబు ఆలోచన సరైంది కాదు. వెంటనే కేంద్రంతో మాట్లాడి రాష్ట్రానికి అదనపు సీట్లు కేటాయించేలా చూడాలి. అలాగే నూతన మెడికల్ కళాశాలల ప్రారంభానికి సహకారమందించాలి.
– బగ్గిరి నిర్మల, నీట్ విద్యార్థిని తల్లి, బత్తలపల్లి



పేద విద్యార్థులకు అన్యాయం

జిల్లాలోని మెడికల్ కళాశాల పూర్తికాకపోవడం... రాష్ట్రంలో తక్కువ శాతం సీట్లు ఉండటంతో నా కుమారుడిని జార్జియా దేశంలో వైద్య విద్య చదివిస్తున్నా. ఎన్నో ఆర్థిక ఇబ్బందుల మధ్య అక్కడికి పంపించాల్సి వచ్చింది. అదే మన రాష్ట్రంలోనే మెడికల్ సీట్ల సంఖ్య ఎక్కువగా ఉండి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మొదలుపెట్టిన మెడికల్ కాలేజీల నిర్మాణాలను ప్రస్తుత ప్రభుత్వం ఆపేయడం, వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయాలని చూస్తుండటం సరికాదు. దీని వల్ల పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది.
– సాంబశివమూర్తి, పెనుకొండ



న్యూస్‌రీల్

వసతి గృహాల రూపురేఖలు మారుస్తాం

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత, చిత్రంలో పల్లె

పుట్టపర్తి: రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి వాటి రూపు రేఖలు మారుస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. శనివారం ఆమె మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి బుక్కపట్నం మహాత్మా జ్యోతిభా పూలే బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. ఈ మేరకు ప్రతి వసతి గృహాన్ని సందర్శించి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. అనంతరం స్థానిక అధికారుల వినతి మేరకు బుక్కపట్నం పాఠశాల భవనం మార్పునకు మంత్రి సవిత అంగీకారం తెలిపారు. అలాగే మండల పరిధిలోని నల్లగుట్టపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాలను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాలల ఉమ్మడి జిల్లా అధికారి రాజేంద్రకుమార్‌రెడ్డి, కన్వీనర్ రమాదేవి, ఈఈ రమణారెడ్డి, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

4,440 కేసులకు పరిష్కారం



జాతీయ మెగా లోక్ అదాలత్‌లో పాల్గొన్న ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి శ్రీనివాస్

అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 4,440 కేసులకు పరిష్కారం చూపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో మొత్తం 22 బెంచులు నిర్వహించారు. బాధిత ఫిర్యాదుదారులు రాజీకి సమ్మతించడంతో 3,021 క్రిమినల్ కేసులు, 123 సివిల్ కేసులు, 62 మోటార్ వాహన ప్రమాద భరిత కేసులు, 1,234 ప్రిలిటిగేషన్ కేసులు (పంచాయతీ ట్యాక్స్‌లు, మునిసిపల్ ట్యాక్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు) పరిష్కారం అయ్యాయి. జాతీయ లోక్ అదాలత్‌లో ప్రమాద భరిత కేసుల్లో కక్షిదారులకు రూ.3,23,35,000 పరిహారం ఇప్పించడంలో రాజీ మార్గంగా పరిష్కరించారు. సివిల్ కేసుల్లో రూ. 20,32,500, ప్రిలిటిగేషన్ కేసులలో రూ.2,02,38,962లను కక్షిదారుల మధ్య రాజీ ప్రకారం ఇప్పించారు. లోక్ అదాలత్ నిర్వహణను ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి. శ్రీనివాస్ , జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి. శివ ప్రసాద్ యాదవ్ పర్యవేక్షించారు.

- లోక్ అదాలత్‌కు విచ్చేసిన కక్షిదారులకు ఉచిత అన్నదానం చేశారు. జిల్లా జడ్జితో పాటు జిల్లా ఎస్పీ పి. జగదీష్ ముఖ్య అతిథులుగా పాల్గొని కేసుల రాజీ ప్రాధాన్యత వివరించారు.


వైద్యసేవలపై సమ్మెట





ఇది లేపాక్షిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. జీఓ నంబర్ 85కు నిరసనగా ఆందోళనకు దిగిన వైద్యులు శనివారం ఓపీ సేవలు నిలిపివేశారు. కేవలం అత్యవసర సేవలు మాత్రం అందించారు. మామూలు రోజుల్లో ఇక్కడ 200 మంది వైద్య సేవలు పొందుతుండగా... శనివారం కేవలం 50 మందికి...అదీ అత్యవసర సేవలే అందించారు. దీంతో సీజనల్ వ్యాధులతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చిన వారంతా సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లారు.

- వివాదాస్పదమైన జీఓ నంబర్ 85
- సమ్మెబాట పట్టిన పీహెచ్‌సీ వైద్యులు
- వెంటనే జీఓ ఉపసంహరించుకోవాలని డిమాండ్
- నిరుపేద రోగులపై తీవ్రంగా చూపుతున్న సమ్మె ప్రభావం



ఓపీ సేవలు నిలిపివేసినట్లు పీహెచ్‌సీ వద్ద అతికించిన నోటీసు

గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు కూటమి సర్కార్ తీరని అన్యాయం చేసేందుకు సిద్ధమైంది. పీజీ సీట్లలో ఇన్‌సర్వీస్ కోటాను సగానికి తగ్గిస్తూ జీఓ నంబర్ 85ను విడుదల చేసింది. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు సమ్మెబాట పట్టారు. ఫలితంగా నిరుపేద రోగులు సకాలంలో వైద్యం అందక అల్లాడిపోతున్నారు.



జీఓ నంబర్ 85 రద్దు కోరుతూ డీఎంహెచ్‌ఓకు వినతి పత్రం అందజేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

ప్రశాంతి నిలయం: కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నింటికీ కోతలు పెడుతోంది. పింఛన్లకు కోత...రేషన్‌కు కోత...చివరకు వైద్యుల ఇన్‌సర్వీస్ కోటాకు కోత వేసేందుకు సిద్ధమైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి వైద్యరంగాన్ని బలోపేతం చేయగా..కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండటంతో వైద్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణ ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వం, తాజాగా ప్రభుత్వ వైద్యుల ఇన్‌సర్వీస్ కోటాలో సీట్ల కోత విధిస్తూ తీసుకున్న నిర్ణయంపై పీహెచ్‌సీ వైద్యులు సమ్మెబాట పట్టారు. దీంతో పీహెచ్‌సీలలో పేదలకు అందే వైద్య సేవలపై తీవ్ర ప్రభావం పడుతోంది.

తీవ్రంగా వ్యతిరేకిస్తున్న డాక్టర్లు..

ఎంబీబీఎస్ పూర్తి చేసి... ప్రభుత్వ వైద్యులుగా గ్రామీణ ప్రాంతాల్లో కనీసం మూడేళ్ల లేదా ఏజెన్సీ ప్రాంతాల్లో కనీసం రెండేళ్ల రెగ్యులర్ సేవలు అందించిన వైద్యులకు పీజీలో ప్రవేశం కోసం ప్రత్యేక కోటా ఉంటుంది. వీరి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఇన్‌సర్వీస్ కోటా పేరుతో క్లినికల్ సీట్లలో 30 శాతం, నాన్ క్లినికల్ సీట్లలో 50 శాతం వరకు రిజర్వేషన్ కల్పించింది. ఈ విధానాన్ని గత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేసింది. అలాగే వైద్యులపై పనిభారం పడకుండా ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు ఉండేలా పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టి వైద్యరంగాన్ని బలోపేతం చేసింది. కానీ కూటమి సర్కార్ ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. ఇన్‌సర్వీస్ పీజీ సీట్ల కేటాయింపులో కోతలు విధిస్తూ నిర్ణయం తీసుకుంది. దాదాపు సగానికి కత్తెర వేసి క్లినికల్ సీట్లను కేవలం 15 శాతం, నాన్ క్లినికల్ సీట్లలో 30 శాతం మాత్రమే పరిమితం చేస్తూ ఇటీవల జీఓ నంబర్ 85ను విడుదల చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమ్మెతో స్తంభించనున్న వైద్యసేవలు...

జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 42 పీహెచ్‌సీలుండగా, ఇందులో 84 మంది వైద్యులు సేవలు అందిస్తున్నారు. ప్రోగ్రాం అధికారులుగా కొందరు జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో పనిచేస్తున్నారు. వీరంతా జీఓ నంబర్ 85ను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సమ్మెబాట పట్టారు. జిల్లాలోని 84 మంది వైద్యులూ సమ్మెలో పాల్గొంటూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. 13న అత్యవసర సేవలను మినహా అన్ని ఇతర సేవలను నిలిపివేశారు. 14న పీహెచ్‌సీల్లో కేవలం అత్యవసర సేవలు మాత్రమే అందించారు. 15న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టి డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. 16 నుంచి జీఓ 85 రద్దు చేసే వరకూ నిరవధిక నిరాహార దీక్ష చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేశారు. శనివారం పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు బంద్ కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జీఓను ఉపసంహరించుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం యువ వైద్యుల ఉన్నత విద్య ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా విడుదల చేసిన జీఓ 85ను వెంటనే ఉపసంహరించుకోవాలి. ఏకపక్షంగా తీసుకున్న ఇలాంటి నిర్ణయాలు పీహెచ్‌సీ వైద్యులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయి. ఇది ముమ్మాటికీ చీకటి జీఓనే. కొత్త జీఓ ప్రకారం ఇస్తున్న కోటాలోనూ క్లినికల్ సీట్లను కేవలం ఆరు విభాగాలకే పరిమితం చేయడం అన్యాయం.
– డాక్టర్ రామకృష్ణ, చిలమత్తూరు పీహెచ్‌సీ

సమ్మె విరమించేది లేదు



ప్రభుత్వం ఇన్‌సర్వీస్ కోటాకు సంబంధించి విడుదల చేసిన జీఓ నంబర్ 85ను ఉపసంహరించుకునే వరకు సమ్మె విరమించేది లేదు. ప్రభుత్వ వైద్యరంగం ద్వారా ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతో ఉన్న మాకు ఈ జీఓ వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుంది. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా జీఓను వెనక్కు తీసుకోవాలి. లేకపోతే సోమవారం చలో విజయవాడ కార్యక్రమం ద్వారా మా నిరసనను తీవ్రతరం చేస్తాం. వైద్యసేవలు నిలిచి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా ప్రభుత్వమే బాధ్యత వహించాలి.
– డాక్టర్ శివరాం, డీఎంహెచ్‌ఓ కార్యాలయం

శభాష్.. అద్భుతంగా పనిచేశారు

- పోలీసులకు ఎస్పీ రత్న ప్రశంస
- సహకరించిన ప్రజలు, మీడియాకు ధన్యవాదాలు



పుట్టపర్తి టౌన్/హిందూపురం అర్బన్: వినాయక వేడుకలు జిల్లాలో ప్రశాంతంగా ముగియడంలో పోలీసుల పాత్ర మరువలేనిదని, జిల్లా పోలీసు యంత్రాంగం అద్భుతంగా పనిచేసిందని ఎస్పీ రత్న ప్రశంసించారు. జిల్లా వ్యాప్తంగా వినాయక శోభాయాత్రలు, నిమజ్జనం ప్రశాంతంగా జరగడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రాత్రింబవళ్లు పనిచేసిన పోలీసులు, సహరించిన ప్రజలు, మీడియా ప్రతినిధులకు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కదిరి, ధర్మవరం, హిందూపురం ప్రధాన పట్టణాల్లో శోభాయాత్ర (వినాయక ఊరేగింపు) నిమజ్జన బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బంది అందరూ ఎంతో నిబద్ధతతో పనిచేశారన్నారు. వినాయక వేడుకలు ప్రశాంతంగా ముగిసేలా కృషి చేసిన పోలీసులందరికీ రివార్డులు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఇదే స్ఫూర్తితో ఈనెల 16న జరిగే మిలాద్ ఉన్ నబీ పండుగకూ పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు.

ప్రశాంతి నిలయంలో ఓనం వైభవం

- వేడుకల్లో పాల్గొన్న కేరళ హైకోర్ట్ జడ్జి సురేష్‌కుమార్




ప్రసంగిస్తున్న కేరళ హైకోర్ట్ జడ్జి సురేష్‌కుమార్, శ్రీ కృష్ణ లీలామృతం నృత్యరూపకంలోని ఓ ఘట్టం

ప్రశాంతి నిలయం: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆధ్యాత్మిక కేంద్రం ప్రశాంతి నిలయంలో శనివారం ఓనం వేడుకలు వైభవంగా జరిగాయి. దేశ, విదేశాల నుంచి వేలాది మంది కేరళీయులు తరలిరాగా పుట్టపర్తి సాయికుల్వంత్ సభా మందిరం కిటకిటలాడింది. వేడుకలను పురస్కరించుకుని సత్యసాయి మహాసమాధిని, సాయికుల్వంత్ సభా మందిరాన్ని కేరళ సంస్కృతీ, సంప్రదాయం ప్రతిబింబించేలా ముస్తాబు చేశారు. ఉదయం వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. కేరళ కళాకారులు ప్రత్యేక వాయిద్య కచేరీతో సత్యసాయికి వందనం సమర్పించారు. సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు. సాయంత్రం కాలికట్‌కు చెందిన సత్యసాయి బాలవికాస్ విద్యార్థులు 'శ్రీ కృష్ణ లీలామృతం' పేరుతో సంగీత నృత్యరూపకం నిర్వహించారు. శ్రీ కృష్ణుడు, సత్యసాయి ప్రదర్శించిన లీలలను చూడచక్కగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కేరళ హైకోర్టు జడ్జి సురేష్ కుమార్ ఓనం వేడుకల విశిష్టతను, సత్యసాయి తత్వాన్ని వివరిస్తూ ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ మంచిని ఆచరిస్తూ గొప్ప సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఉద్యానానికి 'ఉపాధి' ఊతం

- ఈ ఏడాది జిల్లాలో 8,790 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు లక్ష్యం
- ఇప్పటికే 30 వేల ఎకరాల్లో పండ్లతోటల సాగు
- అర్హులైన రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఐదు ఎకరాల్లోపు పొలం ఉన్న రైతులు అర్హులు



తలుపుల మండలంలో రైతు జానకిపతి రెడ్డి ఉపాధి నిధులతో సాగు చేసిన మామిడితోట

ఈ ఏడాది ఉపాధి హామీ ద్వారా తోటల సాగు లక్ష్యం ఇలా..

క్లస్టర్ పేరు	లక్ష్యం(ఎకరాల్లో)
ధర్మవరం	2,145
హిందూపురం	1,615
కదిరి	1,490
మడకశిర	1,770
పుట్టపర్తి	1,770
మొత్తం	8,790

కదిరి: సంప్రదాయ పంటలతో ఏటా తీవ్రంగా నష్టపోతున్న రైతన్నలను ఉద్యాన పంటలు ఆదుకుంటున్నాయి. అందుకే ప్రభుత్వాలూ ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నాయి. ఈ క్రమంలో ఉద్యాన రైతులకు దన్నుగా నిలవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పండ్లు, పూల తోటలు సాగు చేసే రైతులను మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఆర్థికంగా ఆదుకుంటూ వారికి అండగా నిలిచేందుకు సిద్ధమైంది.

30 వేల ఎకరాల్లో సాగు

జిల్లాలో ప్రస్తుతం 30 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. 2024–25 సంవత్సరానికి గాను ఉపాధి హామీ ద్వారా 8,500 ఎకరాల్లో హార్టికల్చర్(పండ్లతోటలు), 140 ఎకరాల్లో పూల తోటలు(ఫ్లోరీ కల్చర్), అలాగే మరో 150 ఎకరాల్లో మోరింగ ప్లాంటేషన్(మునగ) తోటలు ఇలా మొత్తం 8,790 ఎకరాల్లో వివిధ పంటల సాగుకు జిల్లా డ్వామా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు ఇప్పటికే మండలాల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్నారు. ఇందులో భాగంగా సన్న, చిన్నకారు రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ వేగవంతం చేశారు.

ఏయే పంటలకు ఇస్తారు?

ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లు, పూల తోటల పెంపకానికి కొన్ని పంటలకు రెండేళ్లు, మరికొన్ని పంటలకు మూడేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం నిర్వహణ ఖర్చులను అందజేస్తుంది. ఈ నగదు నేరుగా ఆయా రైతుల బ్యాంకు ఖాతాకు జమ చేస్తారు. మామిడి, జీడి మామిడి, చీనీ, నిమ్మ, జామ, సపోట, కొబ్బరికాయ, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, చింత, డ్రాగన్‌ఫ్రూట్ పంటలకు మూడేళ్ల పాటు ఏటా నిర్వహణ ఖర్చులు ప్రభుత్వం అందజేస్తుంది. రేగు పంటతో పాటు మల్లె, గులాబీ తోటలకు మాత్రం రెండేళ్లు మాత్రమే నిర్వహణ ఖర్చులు ఇస్తారు.

ఏ పంటకు ఎంత అంటే...

నిమ్మ సాగు చేసే రైతులు ఎకరాకు 110 మొక్కలు నాటుకోవచ్చు. ఈ పంటకు మూడేళ్లకు కలిపి మొత్తంగా రూ.1,41,515 మేర ఇస్తారు. చీనీ(బత్తాయి)తోట అయితే ఎకరా విస్తీర్ణంలో 100 మొక్కలు నాటుకోవడానికి, ఇతర ఖర్చులకు రూ.1,05,521 చెల్లిస్తారు. మామిడి తోటలో ఎకరా విస్తీర్ణంలో 70 మొక్కలు నాటితే, రూ.1,02,756, నాటీ జామ అయితే 110 మొక్కలకు రూ.1,41,784, తైవాన్ రకం జామ 444 మొక్కలకు రూ.2,30,023, సపోటా 60 మొక్కలకు రూ.88,255, కొబ్బరి 60 మొక్కలకు రూ.88,821, సీతాఫలం 240 మొక్కలకు రూ.1,70,603, దానిమ్మ 267 మొక్కలకు రూ.2,48,845, నేరేడు 20 మొక్కలకు రూ.1,81,124, చింత 40 చెట్లకు రూ.89,120, రేగు 20 చెట్లకు రూ.1,06,962 మేర ఉపాధి నిధులు చెల్లిస్తారు. ఇక డ్రాగన్ ఫ్రూట్‌కు మాత్రం అర ఎకరాకు పరిమితం చేశారు. అరఎకరాలో 900 మొక్కలు నాటితే రూ.1,79,626 ఇస్తారు. అలాగే గులాబీ పూల మొక్కలు ఎకరాకు 2 వేల చెట్లు నాటి రెండేళ్లపాటు సంరక్షించుకుంటే రూ.1,92,500, మల్లె 1,600 మొక్కలకు రూ.1,09,672 ఇస్తారు. పండ్లు, పూల తోటలతో పాటు మోరింగ ప్లాంటేషన్‌లో భాగంగా మునగ పంట సాగు చేసిన రైతులకు 448 మొక్కలకు గాను రూ.1,01,541 లెక్కన చెల్లిస్తారు. నేల స్వభావం, మట్టి పొరలను అనుసరించి డ్వామా అధికారుల సూచన మేరకు గుంతలు తవ్వుకోవాల్సి ఉంటుంది.

ఎవరు అర్హులు?

5 ఎకరాల్లోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు ఈ పథకం ద్వారా ఉద్యాన పంటల సాగుకు ఆర్థిక సాయం పొందవచ్చు. వీరికి ఉపాధి హామీ జాబ్‌కార్డు తప్పని సరి. బ్యాంకు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ కావాలి. వ్యవసాయ గొట్టపుబావి, సాగునీరు అందుబాటులో ఉండాలి. విద్యుత్ సరఫరా తప్పనిసరి. పట్టాదారు పాసుపుస్తకం, 1బీ నకలు అందజేయాలి. సన్న, చిన్నకారు రైతు అని మండల తహసీల్దార్ ధ్రువీకరించాలి. పాస్‌పోర్టు సైజు ఫొటో, రేషన్‌కార్డు, బోరు లేదా బావికి సంబంధించిన కరెంటు కనెక్షన్ ఉన్నట్లు తెలియజేసే ఆధార పత్రం అందజేయాలి. మట్టి నమూనాల విశ్లేషణ ఫలితాల పత్రం కూడా సమర్పించాలి. గతంలో ఇదే పథకం ద్వారా లబ్ధి పొందిన రైతులు... ప్రస్తుతం అర్హులు కాదు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారితో పాటు మహిళా రైతులు, దివ్యాంగులైన రైతులకు ప్రాధాన్యత ఉంటుంది. ఆసక్తిగల రైతులు ఆయా మండల అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో ఉపాధి హామీ ఏపీడీలకు కలిస్తే సరిపోతుంది.

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం



ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్లు, పూల తోటలు సాగు చేయాలనుకునే ఔత్సాహిక రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఇప్పటికే ఎంతో మంది రైతులు ముందుకొచ్చారు. నిబంధనలు అనుసరించి అర్హులైన ప్రతి రైతుకూ పథకం వర్తింపజేస్తాం.
– కె.విజయ ప్రసాద్, పీడీ, డ్వామా

పేద విద్యార్థులకు తీరని నష్టం



ప్రభుత్వ మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వస్తే తక్కువ ఖర్చుతో పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసిస్తారు. వాటిని ప్రైవేటు పరం చేస్తే వైద్య విద్యను అభ్యసించడానికి లక్షలాది రుపాయలు ఖర్చు అవుతుంది. ముఖ్యంగా ఒకటి, అర మార్కుతో సీటు కోల్పోయే విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకున్నట్లే. గతంలో ప్రారంభించిన అన్ని మెడికల్ కాలేజీలనూ అందుబాటులోకి తీసుకురావాలి. పేద విద్యార్థులకు డాక్టర్ కల సాకారం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– గౌస్ లాజమ్, జిల్లా అధ్యక్షుడు, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్



మెడికల్ కాలేజీ పనులు పూర్తి చేయాలి



మాది మధ్య తరగతి కుటుంబం. నా కూతుర్ని వైద్య విద్య చదివించాలన్న ఆశతో బైపీసీ గ్రూపులో చేర్పించాను. గత ప్రభుత్వం మంజూరు చేయించిన మెడికల్ కళాశాలలకు ప్రస్తుత కూటమి సర్కార్ అనుమతి తెచ్చుకుని సీట్ల సంఖ్య పెంచాలి. తద్వారా మాలాంటి కుటుంబాల్లో చదువుతున్న విద్యార్థులకు మెడిసిన్ సీటు వస్తుంది. లేదంటే డాక్టర్ కోర్సు అందని ద్రాక్షగా మారుతుంది. ప్రభుత్వం మరొకసారి ఆలోచించి పెనుకొండలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి. – రూప, గృహిణి, గౌడనకుంట, అమరాపురం మండలం

క్లుప్తంగా

ప్రభుత్వ లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు

ముదిగుబ్బ: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆఫీస్‌లో శుక్రవారం విధుల్లో ఉన్న అనంతపురం జిల్లా ఏఆర్ కానిస్టేబుల్ చంద్రనాయక్ గుండెపోటుతో మృతి చెందారు. మృత దేహాన్ని స్వగ్రామం ముదిగుబ్బ మండలం గరుగుతండాకు తీసుకొచ్చారు. అక్కడ ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. చంద్రనాయక్ మృతి పట్ల ఎస్పీ వి.రత్న సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. చంద్రనాయక్ 2003లో ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా పోలీస్ విభాగంలో చేరారు. అనంతరం ఏఆర్ విభాగానికి వచ్చారు. అంత్యక్రియల్లో ముదిగుబ్బ సీఐ శ్యామరావు, పట్నం ఎస్‌ఐ నరసింహులు, పోలీసుల అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరుగుల వరద.. బౌలర్ల బేజార్





అవుట్ కాకుండా తప్పించుకునేందుకు క్రీజులోకి డైవ్ చేస్తున్న అభిమన్యు ఈశ్వరన్, స్టేడియంలో విద్యార్థులు, అభిమానుల సందడి

- అభిమన్యు ఈశ్వరన్, ప్రథమ్ సింగ్, తిలక్ సెంచరీలు
- పటిష్ట స్థితిలో ఇండియా- ఏ
- ఇండియా-డీ లక్ష్యం 488

అనంతపురం: దులీప్ ట్రోఫీలో భాగంగా అనంతపురంలోని ఆర్డీటీ క్రీడా గ్రామంలో జరుగుతున్న రెండో రౌండ్ క్రికెట్ మ్యాచుల్లో మూడో రోజు శనివారం పరుగుల వరద పారింది. బ్యాటర్ల ధాటికి బౌలర్లు బేజారు పడ్డారు. రెండు మైదానాల్లోనూ సెంచరీల మోత మోగింది. ఇండియా-ఏ జట్టు ఇండియా-డీతో తలపడుతోంది. ఇందులో ఇండియా-ఏ రెండో ఇన్నింగ్స్‌లో ఏకంగా రెండు సెంచరీలు, రెండు అర్ధ సెంచరీలు నమోదయ్యాయి. ప్రథమ్ సింగ్ 122 (12 ఫోర్లు, 1 సిక్సర్), తిలక్ వర్మ 111 (9 ఫోర్లు-నాటౌట్), మయాంక్ అగర్వాల్ 56 (8 ఫోర్లు), షస్వత్ రావత్ 64 (7 ఫోర్లు) పరుగులతో రాణించారు. దీంతో ఇండియా-ఏ జట్టు 380/3 స్కోరు వద్ద మ్యాచ్‌ను డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకుని ఇండియా-డీ ముందు 488 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. తర్వాత ఇండియా-డీ జట్టు మూడోరోజు ఆటముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 19 ఓవర్లలో వికెట్ నష్టానికి 62 పరుగులు చేసింది. యష్ దుబే 15, రికీ భుయి 44 పరుగులతో క్రీజులో ఉన్నారు. ఓపెనర్ అథర్వ టైడ్ డకౌట్ అయ్యాడు. ఇండియా-ఏ బౌలర్ ఖలీల్ అహమ్మద్ ఒక వికెట్ తీశాడు.

ఈశ్వరన్ కెప్టెన్ ఇన్నింగ్స్

ఇండియా- సీతో జరుగుతున్న మ్యాచ్‌లో ఇండియా-బీ కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. అజేయంగా 143 పరుగులు (12 ఫోర్లు) చేసి క్రీజులో ఉన్నాడు. మరో ఓపెనర్ నారాయణ్ జగదీషన్ 70 పరుగులు చేశాడు. వీరిద్దరూ మినహా తక్కిన బ్యాటర్లు పెద్దగా రాణించలేదు. ముషీర్‌ఖాన్ (1), సర్ఫరాజ్‌ఖాన్ (16), రింకూసింగ్ (6), నితీష్‌కుమార్ రెడ్డి (2), వాషింగ్టన్ సుందర్ (13) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. ఇండియా-సీ బౌలర్ అన్షుల్ కాంభోజ్ 5 వికెట్లు తీసుకుని, ఇండియా-బీ జట్టును కట్టడి చేశాడు. ఆట ముగిసే సమయానికి ఇండియా-బీ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు కోల్పోయి 309 పరుగులు చేసింది. అభిమన్యు ఈశ్వరన్ (143), రాహుల్ చహర్ (18) క్రీజులో ఉన్నారు. అంతకు ముందు ఇండియా-సీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 525 పరుగులు చేసింది.

అభిమానుల సందడి

శనివారం నాటి మ్యాచులకు క్రికెట్ అభిమానులు భారీగా తరలివచ్చారు. వారి సందడితో స్టేడియం హోరెత్తింది. తెలుగు కుర్రాడు తిలక్ వర్మ సూపర్ సెంచరీకి నీరాజనాలు పలికారు. విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో రావడంతో స్టేడియంలో గ్యాలరీలన్నీ కిక్కిరిశాయి. స్పైడర్ కెమెరా ఏ గ్యాలరీ వైపు తిరిగితే.. అక్కడి అభిమానులు ఒక్కసారిగా పైకిలేచి కేరింతలు కొట్టారు.



అభివాదం చేస్తున్న సెంచరీ హీరో తిలక్‌వర్మ

ఖాద్రీశుని సేవలో కర్ణాటక లోకాయుక్త జడ్జి



జడ్జికి శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

కదిరి టౌన్: కదిరి లక్ష్మీనరసింహస్వామిని శనివారం కర్ణాటక లోకాయుక్త జడ్జి బీఎస్ పాటిల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు జడ్జికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందజేసి, శేషవస్త్రంతో సన్మానించారు. ఇదిలా ఉండగా కర్ణాటక, చిత్తూరు, వైఎస్సార్, అనంతపురం ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ మురళికృష్ణ, సీఐ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు షీల్డులు అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావ్ పేర్కొన్నారు. కదిరిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లాస్థాయిలో మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్, షాట్‌పుట్, టెన్నికాయిట్,షటిల్, స్పీడ్ వాక్ క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నక్కా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడలతో ఒత్తిడి దూరమై బోధన ప్రశాంతంగా సాగించవచ్చన్నారు. గుణాత్మక విద్యనందించి ప్రభుత్వ బడులను బలోపేతం చేయడంలో మహిళా ఉపాధ్యాయులు ముందుండాలని పిలుపునిచ్చారు. విజేతలకు షీల్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జయచంద్రారెడ్డి, సుధాకర్, శ్రీనివాసులు, తాహిర్‌వలి, సుబ్బారెడ్డి, నరేష్‌కుమార్, మానస, అనిత, షమీం, వనజ, అరుణ, యశోద, సుజాత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

పరిగి: మండలంలోని హొన్నంపల్లి సమీపాన జంగాలపల్లి క్రాస్ వద్ద శుక్రవారం రాత్రి వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (55) మృతి చెందాడు. ఏఎస్‌ఐ వెంకటేశులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొడికొండ - శిరా నేషనల్ హైవే 544ఈపై ఒంటరిగా నడిచివెళ్తున్న వ్యక్తిని వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లి పోయింది. తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న గుర్తు తెలియని వ్యక్తిని స్థానికులు గమనించి మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయినా పరిస్థితి విషమించడంతో అదే రోజు రాత్రి చనిపోయాడు. మృతి చెందిన వ్యక్తి యాచకుడని పోలీసుల విచారణలో తేలింది. ఎస్‌ఐ రంగడుయాదవ్ కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా సరిగ్గా వారం కిందట ఇదే జాతీయ రహదారిపై కిలోమీటర్ దూరంలో ఓ గుర్తు తెలియని వృద్ధురాలు కూడా వాహనం ఢీకొన్న ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. సదరు మహిళ సైతం యాచకురాలిగా ఆనాడు పోలీసులు ప్రాథమిక విచారణలో తేల్చారు. వారం వ్యవధిలోనే అలాంటి ప్రమాద సంఘటనే చోటు చేసుకోవడం చర్చనీయాంశమైంది.

తిరోగమన శక్తులతో శాస్త్ర పురోగతికి విఘాతం





మాట్లాడుతున్న సవ్యసాచి చటర్జీ, మహాసభలకు విచ్చేసిన జేవీవీ సభ్యులు

- జేవీవీ 17వ వార్షిక మహాసభల్లో వక్తలు

అనంతపురం కల్చరల్: తిరోగమన శక్తులతో శాస్త్ర పురోగతికి విఘాతం ఏర్పడుతోందని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. శాస్త్రీయ దృక్పథంతో సమాజాన్ని సమూలంగా మార్చాలని పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక 17వ వార్షిక మహాసభలు శనివారం అనంతపురంలోని మూడవరోడ్డు జీఆర్ ఫంక్షన్ హాలులో ప్రారంభమయ్యాయి. రెండురోజులపాటు సాగే మహాసభలకు సమతా కన్వీనర్ డాక్టర్ ప్రసూన హాజరై జాతీయ పతాకాన్ని, జేవీవీ నాయకులు డాక్టర్ రంగన్న జేవీవీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్ వర్క్ మాజీ అధ్యక్షుడు, శాస్త్రవేత్త సవ్యసాచి చటర్జీ సభలను ప్రారంభించి, 'శాస్త్రీయ దృక్పథం ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్, శాసనమండలి మాజీ చైర్మన్ విఠపు బాలసుబ్రమణ్యం, జేవీవీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సామాజిక కార్యకర్త బోస్, మానతవతా సంస్థ కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి ఆత్మీయ అతిథులుగా ప్రసంగించారు. నేడు దేశం ఎదుర్కొంటున్న కఠినమైన సమస్యలకు పరిష్కార మార్గం జేవీవీతోనే సాధ్యమని పేర్కొన్నారు. 90 ఏళ్ల వయసులోనూ ఇతరుల సాయంతో విచ్చేసిన ప్రముఖ హేతువాది రాధాకృష్ణమూర్తి సభల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అంతకు ముందు ఇటీవల మరణించిన భాగ్యవతి, ఈశ్వరయ్య, లక్ష్మీనారాయణ చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, ఉపాధ్యక్షుడు భాస్కర్, కవి నబి రసూల్, జిల్లా నాయకులు వెంకటరామిరెడ్డి, వీరరాజు, తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లా రోడ్డు ప్రమాద మృతులకు రూ.5 లక్షలు

- క్షతగాత్రులకు రూ.లక్ష
- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ధర్మవరం అర్బన్: చిత్తూరు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం బాధాకరమని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి శనివారం విచ్చేసిన మంత్రి స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు జిల్లా బంగారుపాలెం దగ్గర వేగంగా వస్తున్న లారీ అదుపుతప్పి ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో 8 మంది మృతి చెందారని, 31 మంది గాయపడ్డారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మృతులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందిస్తుందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కోసం చిత్తూరు, తిరుపతి ఆసుపత్రులకు తరలించామన్నారు. ఆర్టీసీ డ్రైవర్ ప్రమాదంలో మృతి చెందాడని, ఆయన కుటుంబానికి సంస్థ తరపున ఇన్సూరెన్స్ కింద దాదాపు రూ.80 లక్షలు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాబోయే కాలంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రమాదరహితంగా మారుస్తామన్నారు.రాష్ట్రంలోని పాతికేళ్లుగా ఏ ప్రాంతంలో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగాయో టాస్క్‌ఫోర్స్ ద్వారా విచారించి.. వాటిని బ్లాక్ స్పాట్‌లుగా గుర్తిస్తామన్నారు. ఆర్టీసీకి 1,400 నూతన బస్సులను తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ఇప్పటికే 600 బస్సులను రోడ్లపై నడుపుతున్నామని తెలిపారు. సమావేశంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిలకం మధుసూదన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపరేటర్ ఆత్మహత్యాయత్నం



శ్రీరామిరెడ్డి

సోమందేపల్లి: మండల కేంద్రం సోమందేపల్లిలోని 104కు సంబంధించి డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్న శ్రీరామిరెడ్డి శనివారం ఆత్మహత్యాయత్నం చేశాడు. హిందూపురంలోని 104కు సంబంధించి ఓ అధికారి తనను వేధింపులకు గురిచేస్తున్నారని, పందిపర్తి రైల్వే క్రాసింగ్ వద్ద ఆత్మహత్య చేసుకుంటానని సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. విషయం తెలుసుకున్న సోమందపల్లి వైద్యుడు ఓంకార్, ఇతర సిబ్బంది అక్కడికి చేరుకొని అతనికి నచ్చజెప్పి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఏదైనా సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించి ఇంటికి పంపారు. కాగా పోలీసులు ఈ ఘటనపై విచారణ చేపట్టారు.


తెలంగాణ వాసి హఠాన్మరణం



మృతి చెందిన రామారావు

పుట్టపర్తి టౌన్: తెలంగాణ వాసి ఒకరు పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శనివారం హఠాన్మరణం చెందారు. ఏఎస్‌ఐ గంగన్న తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన రామారావు (54) పుట్టపర్తి పట్టణంలోని ఎనిమిదో వార్డు గుట్ట ప్రాంతంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిసైన ఈయనకు ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది. దీంతో ఇంటి యజమాని అతడిని బయటకు పంపేశాడు. దీంతో రామారావు గత కొద్ది నెలలుగా పట్టణంలోనే తిరుగుతూ ఉండేవాడు. ఈ క్రమంలో శనివారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ప్రాణం విడిచాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి.. అతడి బంధువులకు సమాచారం చేరవేశారు. మున్సిపల్ సిబ్బంది సహాయంతో కర్ణాటకనాగేపల్లి వద్ద ఉన్న శ్మశానవాటికకు మృతదేహాన్ని తరలించారు. ఆదివారం ఉదయం వారి బంధువులు రాగానే మున్సిపాలిటీ అనుమతులతో అంత్యక్రియలు నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



మృతి చెందిన షేక్ మతిన్

చెన్నేకొత్తపల్లి: జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురంలోని గుల్జార్‌పేటకు చెందిన షేక్ మతిన్ (48) తన మిత్రుడు మహమ్మద్ గౌస్‌తో కలిసి శనివారం ద్విచక్ర వాహనంపై లేపాక్షికి బయల్దేరారు. మార్గం మాధ్యలో చెన్నేకొత్తపల్లి దాటగానే హంద్రీ-నీవా కాలువ సమీపంలో ట్రాక్టర్ బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో షేక్ మతిన్ మృతి చెందాడు. గాయపడిన మహమ్మద్ గౌస్‌ను ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అందుబాటులోకి బీఎస్ఎన్ఎల్ హైస్పీడ్ వైఫై

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లా అంతటా హైస్పీడ్ వైఫై కనెక్టివిటీని అందుబాటులోకి తెచ్చినట్లు భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా శనివారం తెలిపారు. కొత్తగా ప్రారంభించిన ఈ హైస్పీడ్ వైఫై సౌకర్యాన్ని ఫైబర్-టు-ది-హోమ్ (ఎఫ్‌టీటీహెచ్) వినియోదారులందరికీ అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. వినియోగదారులు పాన్-ఇండియా అంతటా రోమింగ్ చేస్తున్నప్పుడు సేవల్లో ఎటువంటి అంతరాయం లేకుండా నాణ్యమైన సేవలందించేందుకు కొత్త వైఫై విధానం దోహదపడుతుందని తెలిపారు. ఎఫ్‌టీటీహెచ్ వినియోగదారులు వైఫై హాట్‌స్పాట్ స్థానాల్లోనూ హైస్పీడ్ వైఫై కనెక్టివిటీతో నాణ్యమైన సేవలు పొందవచ్చన్నారు. డిజిటల్ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు ఇంట్లో లేదా ప్రయాణంలో ఉన్నప్పుడు ఎఫ్‌టీటీహెచ్ వినియోగదారులు ఎటువంటి ఆటంకం లేకుండా కనెక్టివిటీ పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు బీఎస్ఎన్ఎల్ అధికారిక వెబ్‌సైట్ www.ap.bsnl.co.in చూడాలని సూచించారు.

చేనేత పరిశ్రమను కాపాడండి



మాట్లాడుతున్న ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి

ధర్మవరం: సంక్షోభంలో కూరుకుపోతున్న చేనేత పరిశ్రమను కాపాడాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి తెలిపారు. పట్టణంలో ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జింకా చలపతి, ఉపాధ్యక్షుడు గోవిందు, అనంతపురం అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు తదితరులు మాట్లాడుతూ చేనేత 11 రకాల రిజర్వేషన్ల నిబంధనలకు విరుద్ధంగా ప్యూర్ చీరలు తయారు చేస్తూ చేనేత పరిశ్రమనే చిన్నాభిన్నం చేస్తున్నారన్నారు. ధర్మవరం చేనేత పరిశ్రమ పవర్‌లూమ్స్ దెబ్బకు చేనేత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళ్లు ఉన్న కబోదిగా చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చేనేత పరిశ్రమను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమను కాపాడాలని ఈ నెల 18న ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నామని తెలిపారు.

ఎస్ఎస్‌పీఆర్‌కు 'న్యాక్-ఏ' గుర్తింపు



హిందూపురం ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

హిందూపురం: పట్టణంలోని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్మెంట్ అక్రిడిటేషన్‌లో ఏ గ్రేడ్ గుర్తింపు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రగతి తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కళాశాలలో సౌకర్యాలు, బోధన తదితర అంశాలపై ఈ ఏడాది జూలైలో 10, 11 తేదీల్లో న్యాక్ బృందం, ఈనెల 5, 6 తేదీల్లో ముగ్గురు సభ్యులతో కూడిన మరో బృందం కళాశాలను సందర్శించి పరిశీలించిందన్నారు. కళాశాల నిర్వహణ, బోధన, సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ కళాశాలకు న్యాక్-ఏ గ్రేడ్ గుర్తింపు ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ మేరకు న్యాక్ కార్యాలయం నుంచి కళాశాలకు మెయిల్ ద్వారా సమాచారం అందిందిందన్నారు. ఇందుకు సహకరించిన అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ శ్రీలక్ష్మి, నరసింహులు పాల్గొన్నారు.